
సాక్షి
ఆదిలాబాద్
మహిళా దినోత్సవం
శనివారం | 8 | మార్చి | 2025





- ఇళ్లలో స్వేచ్ఛ లభిస్తోంది..
- బయట అనుమానపు చూపులే
- తెలియని వారితోనే సమస్యలు
- మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' సర్వే

బస్టాప్‌ల్లో ఇబ్బందే..!



మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలటౌన్/చెన్నూర్/నిర్మల్/వాంకిడి/బోథ్/ఆసిఫాబాద్‌రూరల్: మహిళలు, యువతులు, విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. పురుషులకు దీటుగా పనులు చేస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. కానీ సమాజంలో అక్కడక్కడ మహిళలపై చిన్నచూపు ఉండడం వల్ల అనేక అవకాశాలకు దూరమవుతున్నారు. పని ప్రదేశాల్లో వేధింపులు, ఆధిపత్య ధోరణులు మహిళలకు ప్రతిబంధకంగా మారుతున్నాయి. ఎక్కడ.. ఎవరితో వివక్షకు గురవుతున్నారనే అంశాలపై 'సాక్షి' మంచిర్యాలలోని శ్రీహర్ష డిగ్రీ కళాశాలతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యార్థినులు, యువతులు, మహిళలు 350మంది నుంచి సర్వే ద్వారా వివరాలు సేకరించింది. తెలియని వారు, ఆకతాయిలతో ఇక్కట్లు పడుతున్నట్లు తేల్చిచెప్పారు. బస్టాప్‌ల్లో అత్యధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. ఇళ్లలో ఆడ, మగ అనే వివక్ష లేదని, అభిప్రాయాలకు గౌరవం లభిస్తోందని స్పష్టమైంది.

సమాజ నిర్మాణంలో అతివలది కీలకపాత్ర



ఆదిలాబాద్: ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూనే అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. వ్యవస్థలకు నాయకత్వం వహిస్తూ ముందుకు సాగుతూ ఉన్నత స్థానాల్లో నిలుస్తున్నారు. అందరికీ సమానమైన హక్కులు లభించినప్పుడే స్త్రీ సాధికారత సాధ్యమవుతుంది. ఆది నుంచి సమాజ నిర్మాణంలో అతివలు ఎంతో కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం సైతం ఎంతో శ్రమిస్తూ ఆధునిక ప్రపంచ నిర్మాతలుగా భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు. చదువు, ఆత్మవిశ్వాసంతోనే నేటి సమాజంలో మార్పు సాధ్యం. – **డాక్టర్ అతీఖ్ బేగం, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఆదిలాబాద్**

ఆమె లేకపోతే సృష్టి లేదు



ఆదిలాబాద్: మహిళ తన జీవితంలో కుటుంబం నుంచి మొదలుకొని సమాజం వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటుంది. ఆడపిల్ల పుట్టుకనే కాదనుకుంటున్న ప్రస్తుత సొసైటీలో వారి ఉనికిని వారే చాటుకుంటూ, ఆడపిల్లల భాగస్వామ్యం సమాజానికి ఎంత అవసరమో అనే విషయాన్ని చాటి చెబుతున్నారు. మహిళలను చిన్నచూపు చూస్తున్న వ్యవస్థలో ఆమె లేకపోతే సృష్టి లేదనే విషయాన్ని మరిచిపోతుండడం శోచనీయం. నవమాసాలు కడుపులో పిండాన్ని మోసి, ఒక జీవానికి ప్రాణం పోస్తున్న అమ్మతనం ప్రతీ స్త్రీలో ఉంటుంది. సమాజ పురోగతిలో వారి పాత్ర ఎనలేనిది. అటువంటి అతివను గౌరవించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిది. – **కల్లెం జీవిత వెంకట్‌రెడ్డి, గైనకాలజిస్ట్, ఆదిలాబాద్**

అవకాశాలు అందిపుచ్చుకోవాలి



నేటి సమాజంలో పురుషులతో పాటు మహిళలు కూడా అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారు. రానున్న రోజుల్లో మరింత సముచిత స్థానం కల్పించాల్సి ఉంది. ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సైతం ప్రతీ మహిళ అందిపుచ్చుకోవాలి. – **రాధిక, ఎస్సై, తాంసి**

ఆమె అడుగు ప్రగతి బాటన పడిింది. సంఘటితమై ఆర్థిక స్వావలంబన దిశగా సాగుతోంది. ప్రకృతి నీడన స్వశక్తితో ఎదుగుతున్న వారు కొందరైతే.. సామాజిక బాధ్యతగా అండగా నిలుస్తున్న వారు ఇంకొందరు. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా ఏజెన్సీకే పరిమితమైన ఆదివాసీ మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఆమె అడుగు.. ప్రగతి వైపు


ఖైర్దాట్వా గ్రామంలో లడ్డూ తయారు చేస్తున్న ఆదివాసీ గిరిజన మహిళలు



ఉట్నూర్‌రూరల్: ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న ఆదివాసీ మహిళలు సంఘటితమై స్వశక్తితో ఎదగాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఉట్నూర్‌కు చెందిన 12 మంది భీంబాయి సంఘంగా ఏర్పడ్డారు. నాటి కాలంలో ఆదివాసీలు రక్తహీనత నివారణకు ప్రకృతి ప్రసాదించిన ఇప్పపువ్వుతో చేసిన లడ్డూలను తినేవారని గుర్తించి వాటి తయారీకి పూనుకున్నారు. విషయాన్ని ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. లడ్డూల తయారీతో కలిగే ప్రయోజనాలను గుర్తించిన అప్పటి కలెక్టర్ దివ్యా దేవరాజన్, పీవో ప్రత్యేక చొరవ చూపారు. వీటిని గర్భిణులు, పిల్లలకు అందించాలనే ఆలోచనతో ముందుకెళ్లారు. ఐటీడీఏ సహకారంతో రూ.14 లక్షలతో 2019లో తయారీ యూనిట్ ప్రారంభించారు. అప్పటి నుంచి లడ్డూలు తయారు చేస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు ఈ సంఘం సభ్యులు. ఆర్డర్ ప్రకారం జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు సరఫరా చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

'పువ్వు'ను ఉపాధిగా మలిచి

- ఉట్నూర్, ఖైర్దాట్వాలో ఇప్ప లడ్డూ తయారీ కేంద్రాలు

వారంతా అడవి తల్లి ఒడిలో సేదతీరే గిరిజనులు. సంఘంగా ఏర్పడి ప్రభుత్వ చేయూతతో ముందడుగు వేశారు. ప్రకృతి ప్రసాదించే ఇప్పపువ్వునే ఉపాధి మార్గంగా ఎంచుకున్నారు. ఆర్థికాభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నారు. వారే ఉట్నూర్, నార్నూర్ మండలంలోని ఖైర్దాట్వాకు చెందిన ఆదివాసీ మహిళలు.

ఉపాధి మార్గం దొరికింది..



ఖాళీగా ఉండకుండా ఏదో ఒకటి చేయాలని మేమంతా ఓ గ్రూపుగా ఏర్పడ్డాం. ఇప్ప పువ్వు లడ్డూ తయారీని ఎంచుకున్నాం. ఐటీడీఏ సహకారంతో సామగ్రి కొనుగోలు చేసి యూనిట్ ప్రారంభించాం. ఇందులో పోషకవిలువలు ఎక్కువగా ఉండడంతో అధికారులు వీటిని గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులతో పాటు వసతిగృహ విద్యార్థులకు అందిస్తున్నారు. అన్ని ఖర్చులు పోనూ ప్రస్తుతం ఒక్కొక్కరికి రూ.15వేల నుంచి రూ.20 వేలకు మిగులుతున్నాయి.

– కుమ్రబాయి, ఆదివాసీ భీంబాయి సంఘం అధ్యక్షురాలు

ఖైర్దాట్వాలో..

నార్నూర్: మండలంలోని ఖైర్దాట్వా గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన మహిళలు 12మంది ఓ గ్రూపుగా ఏర్పడ్డారు. మండల సమాఖ్య సహకారంతో రూ.3.50 లక్షలు రుణం తీసుకుని గ్రామంలోనే ఇప్పపువ్వు లడ్డూ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఫిబ్రవరి 4న కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రస్తుతం నెలకు 60వేల లడ్డూలను తయారు చేస్తున్నారు. వీటిని స్వయంగా వీరే మార్కెటింగ్ చేస్తున్నారు. నార్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ తదితర ప్రాంతాల్లో ఉన్న బేకరీలు, స్వీట్ హౌస్‌ల్లో రూ.300 నుంచి రూ.350 కిలో చొప్పున విక్రయిస్తున్నారు. ఇవి రక్తహీనత నివారణకు దోహదపడుతుండడంతో ఆదరణ లభిస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. అన్ని ఖర్చులు పోనూ గత నెలలో రూ.40వేల వరకు ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు.

ఆదాయం పెరుగుతుంది



గ్రామానికి చెందిన 12 మంది మహిళలం కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడ్డాం. మండల సమాఖ్య ద్వారా రూ.3.50 లక్షలు రుణం తీసుకున్నాం. ఇప్ప పువ్వు లడ్డూల తయారీకి శ్రీకారం చుట్టాం. నెల రోజుల్లోనే 60వేల లడ్డూలు తయారు చేశాం. మార్కెటింగ్ కూడా మేమే చేసుకుంటున్నాం. అన్ని ఖర్చులు పోనూ ప్రస్తుతం నెలకు రూ.40వేల వరకు ఆదాయం వస్తుంది. ముందు మరింత పెరగనుంది.

– ఆత్రం కౌసల్యబాయి, గ్రూప్ అధ్యక్షురాలు, ఖైర్దాట్వా


మిల్లెట్ బిస్కెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే బొజ్జు

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

ఇంద్రవెల్లి: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండలకేంద్రంలోని ఇంద్రాయి మహిళా సమాఖ్య కార్యాలయంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ బిస్కెట్ తయారీ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఏపీఎం రామారావ్ తదితరులున్నారు.

పల్లె నుంచి ఢిల్లీ వరకు.. సుశీల

బోథ్: మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామమైన బాబెరకు చెందిన ఆత్రం సుశీల గ్రామంలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం చేసుకునేలా గ్రామస్తులను ప్రోత్సహించారు. ప్రతీ ఇంట్లో మొక్కలు నాటించే ప్రయత్నం చేశారు. అలాగే ఆదివాసీ గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈమె సేవలకు గుర్తింపుగా 2020లో అప్పటి గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా స్వచ్ఛ అవార్డు అందుకున్నారు. అలాగే 2022లో ఢిల్లీలో నిర్వహించిన ఆదివాసీల వర్క్‌షాప్‌నకు హాజరయ్యారు. మారుమూల గ్రామంలో పుట్టిన ఆదివాసీ మహిళ ఇలా ఉన్నతస్థాయికి ఎదిగారు. ఎంతో మంది మహిళలకు ఆదర్శంగా నిలిచారు.


ఆదివాసీలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న సుశీల

ఆ ఆడపడుచుల కొత్త ఆనవాయితీ

ఇచ్చోడ: ఆ ఊరి అమ్మాయి వివాహానికి గ్రామంలోని అన్ని కుటుంబాలకు చెందిన పెళ్లయిన ఆడపడుచులు కానుకలు సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్టీల్, ఇత్తడి సామగ్రి అందించేవారు. అయితే వీటితో ఎక్కువగా ఉపయోగం ఉండడం లేదు. అలాగే పెళ్లి ఖర్చులు కూడా పెరిగిన నేపథ్యంలో ఆ వధువు తల్లిదండ్రులకు అండగా ఉండాలని నిర్ణయించుకున్న ఆ ఆడపడుచులు కానుకలకు బదులు నగదు అందజేయాలని నిర్ణయించుకున్నారు. విషయాన్ని కుల పెద్దలకు వివరించగా వారు సైతం ఒప్పుకున్నారు. దీంతో నూతన ఆనవాయితీకి శ్రీకారం చుట్టారు నేరడిగొండ మండలం తర్నం పంచాయతీ పరిధి అనుబంధ గ్రామమైన మంగల్‌మోట్‌కు చెందిన ఆడపడుచులు. గ్రామంలో ఈ నెల 3న పెందూర్ వసంత వివాహం జరిగింది. గ్రామానికి చెందిన పెళ్లయిన ఆడపడుచులంతా కలిసి సుమారు 60 మంది వరకు రూ.12వేల నగదు జమ చేసి అందజేశారు. వీరు తీసుకున్న నిర్ణయంపై ఆదివాసీ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. సంప్రదాయాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్నారు.


పెళ్లి కూతురుకు నగదు అందజేస్తూ.. (ఫైల్)

అక్రమంగా ఇంటినంబర్లిస్తే కఠిన చర్యలు

- బల్దియా సమీక్షలో ఎమ్మెల్యే పాయల్ శంకర్

కైలాస్‌నగర్: మున్సిపల్ పరిధిలో అక్రమంగా ఇంటి నంబర్లు జారీ చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే పాయల్ శంకర్ హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఇంజినీరింగ్, శానిటేషన్, మెప్మా, టౌన్ ప్లానింగ్ విభాగాల వారీగా సమీక్షించిన ఆయన అందులోని అక్రమాలను ప్రస్తావిస్తూ అధికారుల తీరుపై మండిపడ్డారు. అక్రమంగా ఇంటి నంబర్లు జారీ చేయడంతోనే కబ్జాదారులు రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని, అడ్డుకుంటే కోర్టుకు వెళ్లి రూ.కోట్ల విలువైన భూములు బల్దియాకు దక్కకుండా చేస్తున్నారన్నారు. బాధ్యులైన వారిని సస్పెండ్ చేయించేదాకా వదలమని హెచ్చరించారు. పట్టణంలో ఆక్రమణలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌పై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. అలాగే ఇంటి అనుమతుల కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా సకాలంలో జారీ చేయాలన్నారు. బయోమైనింగ్ కాంట్రాక్టర్‌కు ఎలాంటి పర్యవేక్షణ లేకుండా రూ.1.5కోట్లు ఎలా చెల్లించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లీచింగ్ పౌడర్, డీజిల్ బిల్లుల్లో అనేక అక్రమాలు జరిగినట్లుగా తన వద్ద పూర్తి ఆధారాలున్నాయని, అయితే ఈ సమావేశంలో వాటిని ప్రస్తావించడం లేదన్నారు. ఇప్పటికైనా సదరు అధికారులు తమ వైఖరి మార్చుకోవాలన్నారు. నిధుల వినియోగంపై సరైన పర్యవేక్షణ లేదని మండిపడ్డారు. వార్డు ప్రత్యేకాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు సంయుక్తంగా ప్రతీ వార్డులో క్షేత్రస్థాయిలో జియోట్యాగింగ్ ద్వారా నీటి ఎద్దడిని పరిశీలించి రెండు రోజుల్లో నివేదిక అందజేయాలన్నారు. షెల్టర్ హోంల నిర్వహణ పేరిట అక్రమంగా బిల్లులు తీసుకుంటున్నారని మెప్మా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు, ఈఈ పెరిరాజు, డీఈలు తిరుపతి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఎస్పీ గౌస్ ఆలం బదిలీ

- కరీంనగర్ సీపీగా స్థానచలనం
- నూతన ఎస్పీగా అఖిల్ మహాజన్


బదిలీ అయిన ఎస్పీ గౌస్ ఆలం


జిల్లాకు రానున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. నూతన ఎస్పీగా అఖిల్ మహజన్ జిల్లాకు బదిలీపై రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఎస్పీగా పనిచేస్తున్న గౌస్ ఆలం 2024 జనవరి 4న జిల్లాకు వచ్చారు. ఈయన గతంలో ములుగు ఎస్పీగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. జిల్లాలో 14 నెలల పాటు విధులు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించిన క్రమంలో ఎన్నికల సంఘం నుంచి ప్రశంసలు పొందారు. జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారించారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపారు. పేదలకు పంపిణీ చేసే పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా చూశారు. పక్కనున్న మహారాష్ట్ర నుంచి దేశీదారు సరఫరా కాకుండా చర్యలు చేపట్టారు. ఈయన పనిచేసినకాలంలో 1200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. అలాగే మట్కా, గుట్కా నిర్మూలనకు చర్యలు తీసుకున్నారు. ఏజెన్సీప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించారు. జైనూర్ ఘటన నేపథ్యంలో జిల్లాలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా గతనెల 6న ఎస్పీ వివాహం జరిగింది. జిల్లాలో పనిచేసిన కాలంలో మంచి గుర్తింపు పొందారు.

జిల్లాకు అఖిల్ మహాజన్ రాక..

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న అఖిల్ మహాజన్ ఆదిలాబాద్ ఎస్పీగా బదిలీపై రానున్నారు. 2017 బ్యాచ్‌కు చెందిన ఈయన ఇదివరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని మంచిర్యాల డీసీపీగా పనిచేశారు. అఖిల్ మహాజన్ జమ్మూ కశ్మీర్‌కు చెందినవారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) నుంచి పట్టభద్రులయ్యారు. కాగా ఈయన సిద్దిపేటలో శిక్షణ పొందగా, మంచిర్యాలలో ఏసీపీగా, తర్వాత రామగుండం, మంచిర్యాల, పెద్దపల్లిలలో డీసీపీగా పనిచేశారు.